క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకృష్ణుడి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన బోయిన పాలన్న, లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు ఎర్రి స్వామి, ఉమాదేవి,శంకర్, చైతన్య రూ.1,11,116 విరాళంగా ఆలయ నిర్వాహకులకు శనివారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన అక్రమ మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి బైక్, మద్యం సీజ్ చేసినట్లు ఆలూరు సెబ్ సీఐ మల్లిక తెలిపారు. శనివారం స్థానిక సెబ్ పోలీసు స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కర్ణాటక మద్యం అక్రమంగా తలరిస్తున్నారనే సమాచారం మేరకు.. హాలహర్వి మండలం చింతకుంట సమీపంలో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీల్లో హాలహర్వి మండలం మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన హనుమంతప్ప బజాజ్ పల్సర్ బైక్‌పై కర్ణాటక మద్యం 384 (90 ఎంఎల్) ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడు. హనుమంతప్పను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లిక వివరించారు. తనిఖీల్లో ఎస్ఐ వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు



నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న సెబ్ పోలీసులు

తుగ్గలి(పత్తికొండ): నాటుసారా స్థావరాలపై పత్తికొండ సెబ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. మండలంలోని పెండ్లిమాన్ తండ పరిసర ప్రాంతాల్లో గుట్టుగా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరంపై సెబ్ సీఐ సువర్ణలత, ఎస్ఐ కార్తీక్, సిబ్బంది దాడులు చేశారు. వెయ్యి లీటర్ల బెల్లం ఊట, 20 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు పోలీసులు చెప్పారు.

పండ్ల మొక్కల పంపిణీ

తుగ్గలి(పత్తికొండ) : నవ యూత్ అసోసియేషన్, సే ట్రీస్ సంస్థల నిర్వాహకులు బోరుబావుల సౌకర్యం ఉన్న రైతులకు శనివారం ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. పత్తికొండ, తుగ్గలి మండలాలకు చెందిన 17 మంది రైతులకు 9,500 పండ్ల మొక్కలు హార్టికల్చర్ అధికారి సునీల్‌కుమార్ పంపిణీ చేసి మొక్కల పెంపకం గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నరసింహులు, సభ్యులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

ఆలూరు రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమం అని జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జానయ్య అన్నారు. శనివారం సంఘం జిల్లా కన్వీనర్ మణి కుమార్‌తో కలిసి మండలంలోని కమ్మరచేడు గ్రామంలో పర్యటించారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టి ఆయన మాట్లాడారు. వర్గీకరణతో విద్య,వైద్య,ఉపాధి, రాజకీయాల్లో ఎదుగేందుకు దోహదం చేస్తుందన్నారు.వీరేషప్ప, శ్రీనివాసులు,గోవర్ధన్, ఎం.వీరేష్, నరసప్ప,ఉలిగప్ప,అల్లప్ప ఉన్నారు.

దేవనకొండ: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ అండ్ ఎంఎస్పీ నూతన జిల్లా ప్రధాన కార్యదర్శి కప్పట్రాళ్ల లక్ష్మన్న మాదిగ శనివారం అన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

ఆలూరు రూరల్: ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది అన్నారు. శనివారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అన్నదమ్ములుగా ఉన్న ఎస్సీల మధ్య వర్గీకరణతో చిచ్చుపెట్టి, ఎస్సీలు రాజకీయంగా ఎదగరాదని అగ్రవర్ణాల రాజకీయ లబ్ధి కోసం బీజేపీ చూస్తోందన్నారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పక్కన పెట్టి ఎస్సీలను విభజించడాన్ని మాల మహానాడు తీవ్రంగా ఖండిస్తుందన్నారు. నాయకులు వన్నూరప్ప,గోపాల్, నాగరాజు, జొజ్జప్ప, చంద్ర,లింగప్ప, వెంకటరాముడు, నాగరాజు ,భరత్,గిరి,మల్లప్ప ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి
- బిల్లేకల్లులో ఇరువర్గాలపై కేసు నమోదు
- గ్రామంలో పోలీస్ బందోబస్తు
- నిర్మానుష్యంగా మారిన గ్రామం







బిల్లేకల్లులో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు, ఆస్పరిలో మాట్లాడుతున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసురెడ్డి, నిర్మానుష్యంగా గ్రామ ప్రధాన రోడ్డు

ఆస్పరి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారిపైనైనా చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో శుక్రవారం దినసరి కూరగాయల వేలం విషయంలో జరిగిన దాడి ఘటనపై టీడీపీ, వైఎస్సార్‌సీపీకి చెందిన 67 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. శుక్రవారం జరిగిన దాడిలో టీడీపీకి చెందిన ఈడిగ వీరేంద్ర, వీరేష్, వీరాంజనేయులు, శ్రీను, నాగరాజు, మురళి, శేఖర్, రవి, ఉరుకుందుతో పాటు మరో 23 మంది, వైఎస్సార్‌సీపీకి చెందిన బోయ లక్ష్మీనారాయణ, ధనుంజయ, సూరి, రంగన్న, యల్లప్ప, రాజశేఖర్, సుంకన్న, జయరాముడు, కృష్ణ, ఎర్రోడుతో పాటు మరో 25 మందిపై కేసు నమోద చేశామన్నారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఇద్దరు సీఐలు, ఎస్ఐలు, 22మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామంలో పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు దినసరి కూరగాయలు మార్కెట్‌ను బంద్ చేస్తున్నట్లు తెలిపారు.

సీఐపై దాడి చేసిన ఘటనలో 20 మందిపై కేసు..

ఘర్షణను అదుపు చేసేందుకు వెళ్లిన ఆస్పరి సీఐ హనుమంతప్పపై దాడి చేసిన కేసులో ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. టీడీపీ వర్గానికి చెందిన ఈడిగ వీరేష్, నాగరాజు, వీరాంజనేయులుతో పాటు మరో ఏడుగురు, వైఎస్సార్‌సీపీకి చెందిన బోయ లక్ష్మీనాచాయణ, ధనుంజయ, రాజశేఖర్‌తో పాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. బిల్లేకల్లులో శుక్రవారం ఇరువర్గాల ఘర్షణ రణరంగాన్ని తలపించడంతో శనివారం వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. హోటళ్లు, దుకాణాలు కూడా తెరవలేదు. చాలా మంది వ్యయసాయ పనులకు వెళ్లకుండా ఇంటిపట్టునే ఉండిపోయారు.

బాలికల హాస్టల్ తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆదోని రూరల్: పట్టణంలోని సమీకృత సాంఘిక బాలికల వసతి గృహాన్ని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి వసతిగృహంలో ఆహారం, తాగునీరు, ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన వద్దకు వచ్చి చెప్పవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థి దశలోనే గమ్యాన్ని నిర్దేశించుకుని వాటి కోసం రోజూ సాధన చేసి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేసరికి గమ్యాన్ని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని విద్యనభ్యసించాలని చెప్పారు.

ఉపాధ్యాయుల ఘర్షణపై విచారణ

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య జరిగిన ఘర్షణపై డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి శనివారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఘర్షణకు దారి తీసిన కారణాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఘర్షణకు పాల్పడిన ఉపాధ్యాయుడు సురేష్‌ను పిలిపించి మాట్లాడారు. సర్వీస్ రిజిస్టర్‌లో డేటా ఎంట్రీలు సరిగా లేవు, వాటిని సరి చేయాలని హెచ్ఎంతో మాట్లాడామే తప్ప ఘర్షణకు పాల్పడలేదని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు డిప్యూటీ ఈఓ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు.



శిథిలం..

మండల కేంద్రం చిప్పగిరిలోని ఊరు వాకిలి శిథిలమై.. కూలిపోయే దశకు చేరుకుంది. ఊరు నడిబొడ్డున ఉండటంతో నిత్యం ప్రజలు ఆ ఊరి వాకిలి గుండా రాకపోకలు సాగిస్తున్నారు. సమీపంలో పశువైద్యశాల కూడా ఉండటంతో నిత్యం రైతులు, పశుపోషకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే శిథిలమైన ఊరివాకిలి గుండా రాకపోకలు సాగించే క్రమంలో బండరాళ్లు ఎప్పుడు మీద పడతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురాతన కట్టడం కావడంతో ఇప్పటికే ఒక వైపు కూలిపోయింది. మరోవైపు కూడా ఆ దశకు చేరుకోవడంతో నూతన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–చిప్పగిరి

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



ఆస్పరి మండలమీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆస్పరి: మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సుంకుర ఉమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దాహం తీర్చుకునేందుకు ప్రజలు కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. అధిక శాతం వ్యవసాయ బోర్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారన్నారు. మండలంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు చేపట్టాలని చెప్పారు. హంద్రీ నీవా నీటి ఆధారంగా జొహరాపురం వద్ద సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మించి పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్‌ను ఆదేశించారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు హాజరుకారని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఆయా శాఖల అధికారుల తీరును జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ గాయత్రీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

తుగ్గలి : మండలంలోని రామలింగాయపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రంగనాథ రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే.. రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి మండలం ఎర్రగుంట్లపల్లి వెంకటేశ్వరరెడ్డి కుమారుడు మృతి చెందారు. ఆయా కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం పరామర్శించి ఓదార్చారు. ఆమె పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే ఈశ్వరరెడ్డి వర్ధంతి

తుగ్గలి : సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే కనికిరెడ్డి ఈశ్వరరెడ్డి 46 వర్ధంతిని ఆదివారం ఆయన స్వగ్రామం జీ.ఎర్రగుడిలో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు నిర్వహించనున్నారు. సాయంత్రం బస్టాండ్ సమీపంలోని స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు. కార్యక్రమానికి సీపీఎం అనంతపురం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కర్నూలు జిల్లా రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణతో పాటు పార్టీ నాయకులు హాజరు కానున్నారని ఆయన తనయుడు భాస్కరరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ల టైర్ల చోరీ



ట్రాక్టర్ల టైర్లను అపహరించిన దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వైఎస్సార్ సుజల స్రవంతి పథకానికి సంబంధించి వెల్దుర్తి మండలంలో మంచి నీటి సరఫరాకు కేటాయించిన ట్రాక్టర్ల టైర్లు చోరీకి గురయ్యాయి. పట్టణ సమీపంలోని రామళ్లకోట రోడ్డులోనున్న వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంట్ వద్ద ఏడాదికి పైగా నాలుగు కొత్త ట్రాక్టర్లను వినియోగించకుండా నిలిపి ఉంచారు. ఆయా ట్రాక్టర్లకు సంబంధించి 6 పెద్ద టైర్లను గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. అలాగే.. బ్యాటరీలు, సెల్ఫ్ మోటార్లు సైతం లేకపోవడాన్ని గుర్తించి శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారం నీదే.. ఈరన్న!



క్షేత్రం ముంగిట పూర్తిగాని పెండాల్స్ పనులు



కొనసాగుతున్న క్యూలైన్ల ఏర్పాట్లు

- ఉరుకుంద ఉత్సవాల ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం
- నేటికీ పూర్తవని ఏర్పాట్లు
- వేలాలకు రాజకీయ గ్రహణం
- టెంకాయల విక్రయ వేలాలపై కోర్టుకు
- సోమవారం నుంచి శ్రావణమాసోత్సవాలు
- ఇప్పటికే భారీగా చేరుకున్న భక్తులు

మంత్రాలయం : తెల్లవారితే వెల్లువలా తరలివచ్చే భక్త జనం.. వారికి అవసరమైన ఏర్పాట్లు అంతంత మాత్రమే..అసలు ఉత్సవాల బాధ్యత మోసేదెవరు? ఆలయ హోదా పెరిగిన మొదటి ఏడాదే మొక్కుబడిగా ఏర్పాట్లు కానిస్తున్నారు.. మొత్తానికి క్షేత్రంలో అన్నీ ప్రశ్నార్థకమే. గతంలో ఉత్సవాలకు రెండు నెలల ముందే ఏర్పాట్లు మొదలయ్యేవి. ఈ సారి ఇటు పాలకులు, అటు అధికారులుగానీ ఉత్సవ ఏర్పాట్లపై ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో ఈరన్న స్వామి వేడుకలు ఎలా సాగుతాయో స్వామికే ఎరుక..

నెల పాటు ఉత్సవాలు..

జిల్లాలో దేవదాయశాఖ నిర్వహణలోనున్న ప్రధాన ఆలయాల్లో ఉరకుంద ఈరన్న స్వామి క్షేత్రం ఒకటి. ఏటా శ్రావణమాసంలో ఇక్కడ మాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. నెలరోజులు పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారు. ఈ మాసంలో దాదాపు 12 లక్షల భక్తులు స్వామిని దర్శించుకుంటారు. సోమవారం నుంచి ఇక్కడ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సోమ, గురు, శనివారాలు ప్రత్యేక ఉత్సవ దినాలు. ఆరోజుల్లో భక్తులు లక్షల్లో స్వామి సేవలో తరిస్తారు. వచ్చే అమావాస్య వరకు వేడుకలు కొనసాగుతాయి.

వేలాలకు రాజకీయ గ్రహణం..

ఉత్సవాల వేలాలకు రాజకీయ గ్రహణం పట్టింది. అధికార పార్టీ ముఖ్య నాయకుల వ్యూహంలో భాగంగా నెల రోజులు వేలాలు వాయిదా పడ్డాయి. వేలాలు జూన్ మొదటి వారంలో జరగాల్సి ఉండగా 30వ తేదీన పూర్తి చేశారు. అందులో కొన్ని వేలాలు పూర్తి కాగా.. టెంకాయల విక్రయాల వేలంలో సందిగ్ధత నెలకొంది. జూన్ 30న రూ.70 లక్షలకు ఓ ఏజెన్సీ టెంకాయల విక్రయాలను సొంతం చేసుకుంది. గంటలోపే వేలం మొత్తాన్ని చెల్లించాలని షరతు పెట్టడంతో వేలం రద్దు చేశారు. జూలై 20న మళ్లీ టెండర్ వేయగా మరో ఏజెన్సీ రూ.64 లక్షలతో పాడింది. కాగా ఇదే టెంకాయల వేలాన్ని రూ.70 లక్షలకు పాడిన ఏజెన్సీ హైకోర్టును ఆశ్రయించింది. తమకు సమయం ఇవ్వకుండా వేలాన్ని రద్దు చేయడం సరికాదని, తక్కువ టెండర్ దాఖలు చేసిన ఏజెన్సీకి వేలాన్ని ఇవ్వడం పద్ధతి కాదని హైకోర్టులో కేసు వేశారు. ఈనెల 30న సదరు కేసును హైకోర్టు 6వ తేదీకి వాయిదా వేసింది. ఉత్సవాలు మాత్రం 4వ తేదేనే ప్రారంభం కానున్నాయి. టెంకాయల వేలం విషయంలో సందిగ్ధం నెలకొనడంతో భక్తులకు టెంకాయలను ఎలా సరఫరా చేస్తారో గందరగోళం నెలకొంది. తీర్పు వస్తేనే టెంకాయల విక్రయాలు సాఫీగా సాగే అవకాశం ఉంది. లేదంటే టెంకాయలు దొరకక భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. టెంకాయల వేలం వెనుక టీడీపీ ముఖ్య నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం.

గట్టెక్కని ఏర్పాట్లు..

ఉత్సవాలకు 24 గంటల సమయమే మిలిగి ఉంది. ఇలాంటి తరుణంలోనూ ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయం ముంగిట పెండ్యాల్స్, దర్శన క్యూలైన్లు, దుస్తుల మార్పిడి షెడ్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి వసతులు, విద్యుద్దీపాల ఏర్పాట్లు సగం కూడా పూర్తికాలేదు. ఆదివారం అమావాస్య, సోమవారం వేడుకల ప్రారంభం కానుండటంతో ఇప్పటికే వేలాది మంది భక్తులు ఉరకుంద చేరుకున్నారు. పాదయాత్ర భక్తులు రెండు రోజులుగా క్షేత్రానికి పోటెత్తారు. ఈ తరుణంలో ఏర్పాట్లు ఒక రూపునకు రాకపోవడంతో భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ..అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుబడుతున్నారు.

పెద్దహ్యాటకు బస్సు సర్వీసు



ఆర్టీసీ బస్సు వద్ద విద్యార్థులు, గ్రామస్తులు

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో బస్సులు తిరగక పోవడంతో గ్రామం నుంచి హొళగుందకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు విద్యార్థినులను తల్లిదండ్రులు చదువులు మధ్యలోనే ఆపించారు కూడా. సమస్య తీవ్రతను ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరంగ, కురువ సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్యాట మల్లయ్యతో పాటు గ్రామస్తులు ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫి దృష్టికి తీసుకెళ్లారు. వారు శనివారం గ్రామానికి బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పక్కాగా ఈ పంట నమోదు

కృష్ణగిరి: ఖరీఫ్ ఈ– పంట నమోదును పక్కాగా చేపడతామని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ– పంట నమోదుకు సిద్ధంగా ఉన్నామని, పంట నమోదులో ఎక్కడా తప్పులు దొర్లకుండా చూస్తామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రత్యామ్నాయంగా ప్రణాళికలు తయారు చేసుకుంటామన్నారు. అలాగే కౌలు రైతు పత్రాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రైతులు తమ పంటలను సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు.

ఆ స్థలాలను ఎస్సీలకే కేటాయించాలి

మద్దికెర : ప్రభుత్వం ఎస్సీలకు కేటాయించిన స్థలాలను పూర్తి స్థాయిలో వారికే పంపిణీ చేయాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక గుంతకల్లు రహదారిలోని పెట్రోల్ బంకు వద్దనున్న సర్వే నంబర్ 444 –2డీ లోనున్న ఇంటి స్థలాల కోసం కేటాయించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రభుత్వం 124 మందికి ఇళ్ల స్థలాలను కేవలం 54 మందికి మాత్రమే కేటాయించిందన్నారు. అలా కాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అంతకుముందు ఆయనకు సర్పంచ్ సుహాసిని, రాముడు, ఆంజనేయులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన అధికారులు

తుగ్గలి : రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌ను శనివారం పలువురు అధికారులు కలిశారు. మద్దికెరలో ఎస్సీలకు అందించిన భూములను పరిశీలించిన అనంతరం ఆయన విజయవాడ వెళ్తూ మార్గ మధ్యలో తుగ్గలిలో కాసేపు ఆగారు. సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ నాగప్ప, పత్తికొండ అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి బాబు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పులిశేఖర్, వసతిగృహ వార్డన్లు రమేష్, వెంకటరాముడు కలిశారు.

నేటి నుంచి నీటి సరఫరా నిలిపివేత

తుగ్గలి(పత్తికొండ) : ఫిల్టర్‌బెడ్ మరమ్మతుల కారణంగా కొత్తపల్లి రిజర్వాయర్ హెడ్‌వర్క్స్ నుంచి పత్తికొండ పట్టణానికి సరఫరా అయ్యే తాగునీటిని ఆదివారం నుంచి వారం పాటు నిలిపివేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహబూబ్ ఖాన్ శనివారం తెలిపారు. ప్రత్యామ్నాయ పైపుల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపడుతామని, దీంతో కొంతమేర రంగుమారిన నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి



మద్దికెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర : పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని ప్రభుత్వ వైద్యాధికారి రాగిణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, ఏఎన్ఎంలు లక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు బలం

తుగ్గలి(పత్తికొండ) : తల్లి పాలే బిడ్డకు బలం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ, సీహెచ్‌వో రవికుమార్ అన్నారు. శనివారం హోసూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పుట్టినప్పటి నుంచి ఆరునెలల వరకు బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలన్నారు. గర్భిణులు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంలు లక్ష్మీనరసమ్మ, మంజువాణి, అంగన్‌వాడీ టీచర్లు హైమవతి, పద్మావతి, రామచంద్రమ్మ, కళావతి, పీరమ్మ, శకుంతలమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, కేంద్రాలలో బాలింతలు, గర్భిణులతో సమావేశాలు ఏర్పాటు చేసి తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్నారు. శనివారం రామళ్లకోట 4వ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సరస్వతి, ఏడబ్ల్యూఓ లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ ల్యూక్, మెడికల్ ఆఫీసర్ భువనతేజ మాట్లాడుతూ తల్లిపాలు దేవుడిచ్చిన వరమన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ఈశ్వరి, ఏఎన్ఎం మద్దయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గువ్వలకుంట్ల గ్రామ కేంద్రంలో సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత పాల్గొని తల్లిపాల గురించి వివరించారు. వెల్దుర్తిలోని 3,5,6,7 కేంద్రాల్లో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్ఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మన్సూర్‌వలి

ఆలూరు: ప్రజలు సీజనల్ వాధ్యుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలని, వ్యాధులపై వారికి అవగాహన కల్పించాలని మొలగవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవికుమార్ సూచించారు. స్థానిక సచివాలయం–2లో శనివారం వివిధ గ్రామాల ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టిక ఆహారం తీసుకునేలా చూడాలన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యంమెరుగు, దోమల నివారణ, వ్యాధులు తదితర వాటిపై ప్రజలకు వివరించాలని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్ ఆంద్రూస్ పాల్గొన్నారు.

హాలహర్వి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మన్సూర్‌వలి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి రోగులకు చికిత్స చేసి మందులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు నీటిని కాచి చల్లార్చి వడబోసి తాగాలన్నారు. రాత్రివేళల్లో దోమతెరలను వాడాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా చూసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు, సంగాల గ్రామాల్లో శనివారం ఈఓపీఆర్డీ బాలన్న ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, బీసీ, ఎస్సీ, కాలనీల్లో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. చెత్త చెదారం కార్మికులకు అందజేయాలని గ్రామస్తులకు సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com